క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

గోపాలపురం: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న గోపాలపురం–దొండపూడి రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే పరిచయ కార్యక్రమంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2.50కోట్లు మంజూరు చేయించారు. ఈ నెల 20వ తేదీన రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజచేశారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో సుమారు 10 గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని అమలు పరచడంతో మండల వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి వనితకు కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడకు ఆర్టీసీ సర్వీస్

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి కాకినాడకు పల్లె వెలుగు సర్వీస్‌ను ఈనెల 26న నుంచి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ తలిపారు. ఉదయం 6 గంటలకు నిడదవోలు డిపో నుండి బయలుదేరి 9.15 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.45 గంటలకు బయలుదేరి నిడదవోలు డిపోకు చేరుకుంటోంది. ఇక్కడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి 3.15 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. అక్కడ నుండి మరలా 3.45 గంటలకు బయలుదేరి రాత్రి 7గంటలకు నిడదవోలు చేరుకుంటోందని డీఎం పేర్కొన్నారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం

నిడదవోలు : రోటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీనగర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో షుగర్, బీపీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, రోటరి అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు ,గుంటిపల్లి శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, పొన్నా సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నాబత్తుల రామారావులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రజకజన సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కట్లయ్య



నల్లజర్ల: సామాజిక వర్గాల ప్రాధాన్యతలపై రాజకీయ పార్టీలు అణచివేతకు గురిచేస్తున్నాయని రజకుల జన సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన ఏలూరులో నిర్వహించనున్న రజకజన మహాసభకు జన సమీకరణకు వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ నల్లజర్లలో శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా రజకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని కట్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు, స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ల గడచినా రజకుల సామాజిక స్థితి మారకపోవడం దురదృష్టకరమన్నారు. రజకులను కించపరుస్తూ మాట్లాడే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రజకుల ఆర్థికాభివృద్ధికి చట్టాలు చేసి, జీవోలు జారీ చేసినప్పటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులను సమాయత్తం చేసి ఈనెల 26న ఏలూరులో మహాసభ వేదిక కానుందన్నారు. రజక వృత్తి చెరువుల విషయంలో పంచాయతీల తీరు మార్చుకోవాలని, రజక వృత్తి చెరువుల పూర్తి స్థాయిలో నిర్ధారించేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. రజకజన సభలో రజకుల ఇబ్బందులపై పరిష్కార దిశగా తీర్మానాలు చేసి ప్రభుత్వం ముందుంచుతామన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందించేందుకు 29 వరకూ గడువు

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు ప్రతి సంవత్సరం సమర్పిస్తున్న తమ లైఫ్ సర్టిఫికెట్లను ఈనెల 29వ తేదీలోపు ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని జిల్లా ఖజానాధికారి ఎస్.సత్యనారాయణ తెలిపారు. పింఛనుదారులు తప్పనిసరిగా సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయంలో సమర్పించి నమోదు చేయించుకోవాలని కోరారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- గ్రామాలో జగనన్న పాల వెల్లువ కేంద్రాల ప్రారంభం



కలవలపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాడిమళ్లలో పాడి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చాగల్లు: జగనన్న పాల వెల్లువ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలో కలవలపల్లి గ్రామంలో జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. అమూల్ కేంద్రాల ద్వారా పాల సేకరణ చేసి దళారుల ప్రమేయం లేకుండా పాడి రైతులకు తగిన ధర చెల్లిస్తున్నారన్నారు. అందులో భాగంగా త్వరలో కాపవరంలో బల్క్ మిల్క్ యూనిట్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, జెడీ ఎస్‌టీజీ సత్యగోవింద్, ఎంపీపీ మాట్టా వీరాస్వామి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఉప సర్పంచ్ హరినాథ్, ప్రత్తిపాటి రామచంద్రారావు, అధికారులు పాల్గొన్నారు. మండలంలో చంద్రవరం, చిక్కాల, ఎస్ ముప్పవరం, నెలటూరు గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించారు.

వేములూరులో...

కొవ్వూరు: వేములూరు గ్రామంలో జగనన్న పాల వెల్లువలో భాగంగా ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, శ్రీరామ సొసైటీ మాజీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహం లింకన్, ఎంపీడీవో కె.సుశీల, ఏపీఎం పి.రోజ్‌మాణిక్యం, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు బోడపాటి హనుమంతరావు, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామంలో మహిళా పాడి రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమూల్ పాలసేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 32 గ్రామాల్లో తొలి విడతగా పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రబాబు, సూర్యనారాయణ, కాగిత సత్తిపండు, ఎంపీడీఓ జేవీ ఝాన్సీ పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: మండలంలోని 15 గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ప్రారంభించారు. ఖండవల్లి గ్రామంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పాల వెల్లువ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు డ్వాక్రా మహిళలు ఒక గ్రూప్‌గా ఏర్పడి ఒకరిని సెక్రటరీగా నియమించుకోవాలని, ప్రతి రోజు ఒక్కో కేంద్రం ద్వారా 160 లీటర్ల పాలను సేకరించాలన్నారు. ఈ పాలను అమూల్యా సంస్థ సేకరిస్తుందని, లీటరుకు రూ.110 ధర చెల్లుస్తుందన్నారు. దీని ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పశువైద్యాధికారి సల్మా డ్వాక్రా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువతో రైతులకు మేలు

ఉండ్రాజవరం: జగనన్న పాలవెల్లువతో మహిళా పాడి రైతులకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా మండలంలో పాలంగి, కె.సావరం, సూర్యారావుపాలెం, సత్యవాడ, చిలకపాడు, దమ్మెన్ను గ్రామాల్లో శుక్రవారం పాల సేకరణ కేంద్రాలను ప్రారంభించారు. దమ్మెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మిగిలిన గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు ప్రారంభించారు.

దళారీ వ్యవస్థ నుంచి కాపాడేందుకే జగనన్న పాలవెల్లువ: మంత్రి వనిత



చిట్యాలలో మిల్క్ బల్క్ ప్లాంటును ప్రారంభించిన మంత్రి తానేటి వనిత

గోపాలపురం: దళారీ వ్యవస్థ నుంచి కాపాడి వారి కష్టానికి తగిన ప్రతి ఫలాన్ని అందజేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పాల వెల్లువ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గోపాలపురం మండలం చిట్యాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మిల్క్ బల్క్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గోపాలపురం మండలం పెద్దాపురంలో మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ కుమార్తెను ఆశీర్వదించారు. మంత్రి వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరారవు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చాగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లు మండలం నందిగంపాడు గ్రామంలో రూ.82.1 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశ రావు, ముప్పిడి మహాలక్ష్ముడు, నందిగంపాడు సర్పంచ్ కుడప రాంబాబు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షులు మేకా సురేష్, చిలి ప్రసాద్, ఇడుపుగంటి రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నల్లజర్ల: స్థానిక బైపాస్ రోడ్డులో అచ్చన్నపాలెం కాలనీ వద్ద శుక్రవారం రాత్రి 7.30 గంటలకు రహదారి దాటుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో కాలనీకి చెందిన గోగులమూడి అచ్చాయమ్మ(53) మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆమెను ఢీకొన్న వాహనం ఆచూకీ కోసం సమీప లక్ష్మీ మల్టీప్లెక్స్, గరుడ హోటల్ సీసీ పుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

9న జాతీయ మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: వచ్చే నెల 9వ తేదీన కొవ్వూరులో నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కేసు పరిష్కరించుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పట్టణంలో జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్క రించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

ఉండ్రాజవరం : జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. పాలంగి సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొక్క శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేద ప్రజలకు మంచి వైద్యం అందుతోందని, ఈకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవైద్య శిబరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్యతో ఎంపీపీ, సర్పంచ్ పరిశీలించారు. ఈశిబిరంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి. ప్రసాద్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ పృధ్వీసింగ్(ఎంఎస్), డాక్టర్ విద్యాధరరావు (ఆర్థోపెడిక్)లు పాల్గొని సుమారు 451 మందిని పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సీహెచ్‌వో సుబ్రమణ్యం, కార్యదర్శి హసన్‌జానీ, హెల్త్ అసిస్టెంట్ కాపా నాగరాజు, పాలాటి శరత్, బొక్క శివ కుమార్, దొడ్డా సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాలంగిలో రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి.

ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి ధీమా

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి ధీమానిస్తుందని తెలికిచెర్ల సర్పంచ్ బండి చిన నాగరాజు(చిట్టీ)అన్నారు. పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని తెలికిచెర్ల శివారు కమతంగుంటలో శుక్రవారం సచివాలయం–2లో రెండో విడత వైద్యశిబిరం నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టరు దేవిశ్రీ, పోతవరం పీహెచ్‌సీ డాక్టరు వెంకట్రావు 554 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శిబిరంలో ఉపసర్పంచ్ నక్కా పండు, యర్రా నాగేశ్వరావు, పదిలం సుబ్బారావు, నల్లారాజారావు, బొట్టా సుబ్బారావు, వీఆర్వో శ్రీదేవి, కార్యదర్శి పదిలం దాన నాగేశ్వరావు, ఏఎన్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.



కమతంగుంటలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ చిట్టీ

406 మందికి ఉచిత వైద్య పరీక్షలు

దేవరపల్లి: బందపురం గ్రామ సచివాలయ వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 406 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్టు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు(గాంధీ), ఎంపీటీసీ సభ్యుడు ఎస్. కాశీవిశ్వనాథం, వైద్య సిబ్బంది, వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షకు ఏర్పాట్లు

- మండలంలో 3 పరీక్షా కేంద్రాలు

తాళ్లపూడి: గ్రూప్–2 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జరగనున్న గ్రూప్–2 పరీక్ష నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో 220 నుంచి 260 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ పాఠశాల, తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల మొత్తం 3 కేంద్రాల్లో 720 మంది పరీక్షకు హాజరుకానున్నారన్నారు.ఈ పరీక్షా కేంద్రాల్లో తాగు నీరు, కరెంట్, లైటింగ్, ప్రత్యేక హెల్ప్ డెస్క్, పరీక్ష రాసేవారి మొబైల్ ఫోన్ల భద్రపరిచే రూం అన్నీ సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు. తహసీల్దార్ వెంట ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వర రావు, కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి, అధ్యాపకులు మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాళ్లపూడి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పశివేదలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

కొవ్వూరు: అన్నీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సువర్ణ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పశివేదల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు ఇంటింటీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో చేకూర్చిన లబ్ధిని గణంకాలతో వివరిం చారు. గ్రామం వైఎస్సార్ విగ్రహాలకు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు పోసిన శ్రీకృష్ణ దేవరాయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పశివేదలలో ప్రభుత్వం పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మేలు జరిగితేనే ఓటేయమన్న ఏకైక సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రావిమెట్ల–శంకరాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

నిడదవోలు రూరల్: దేశ రాజకీయాల్లో ఇప్పటి వరకు మీకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలం రావిమెట్ల–శంకరాపురం గ్రామంలో సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పులూరి తేజశ్రీ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షాలన్నీ ఏకమైనా ప్రజల ఆశీర్వదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రావిమెట్ల–శంకరాపురం గ్రామంలో రూ.18.60 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.7.79 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎర్రకాలువ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, ఎమ్మెల్యే తనయుడు వరుణ్‌సాయి, నాయకులు చిలుకూరి చిట్టిప్రసాద్, కాల్దారి శ్రీను, ఉప్పులూరి రామకృష్ణ, మిద్దే శ్రీను, అరవాలరాజు, చదలవాడ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



రావిమెట్లలో వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

క్వారీలారీ డ్రైవర్లకు మెరుగైన వేతనం ఇవ్వాలి

దేవరపల్లి: దేవరపల్లి, కొవ్వూరు మండలాల పరిధిలోని క్వారీలు, క్రషర్ల లారీలపై పనిచేస్తున్న డ్రైవర్లు, హెల్పర్లకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని క్వారీ, క్రషర్ల యజమానుల సంఘం ప్రతినిధులను కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న వేతన ఒప్పందం మార్చి 9వ తేదీతో ముగుస్తున్నందున తిరిగి నూతన వేతన ఒప్పందం చేయాలని కార్మిక సంఘాల నేతలు శుక్రవారం యజమానుల సంఘం కార్యదర్శి గౌరీబాబుకు 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రమేష్, పి. నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, దుర్గారావు, నాగరాజు, ఎస్‌కే మస్తాన్, ఏడుకొండలు, గంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం

నిడదవోలు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా పనిచేసే వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కొనియాడారు. పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వలంటీర్లతో జ్యోతిప్రజ్వలన, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేయించి వారికి ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ తొలి కోడి కూయకముందే, వేకువ జామునే తలుపు తట్టి మరీ సంక్షేమ పథకాలను పేదల ముంగిట్లోకి తీసుకువెళుతున్న వలంటీర్లు సీఎం జగనన్నకు సైనికులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం గురించి ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారని గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య దేశంలో అందరూ సమానులే, అందరికీ సమాన హక్కులు కలిగి ఉండాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను రూపొందించారన్నారు. ఈ రోజు మీరంతా పేవారత్న, సేవా మిత్ర, సేవా వజ్ర అని విభజించబడినప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న పేదల దృష్టిలో మీరందరూ సేవా వజ్రాలేనన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి వలంటీర్లు పెన్షన్లు అందిస్తున్నారని పేదల కళ్లల్లో ఆనందం వారికి మీపై కలిగిన ప్రేమ ఆప్యాయతలు ఎనలేనివన్నారు. అంకితభావంతో సేవలందించాలని అన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా అమలు చేస్తున్న పథకాలను కులమతతాలకు అతీతంగా పేదలకు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. జగనన్న తిరిగి అధికారంలోకి రానున్నారన్నారు. సీఎం జగనన్న ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకు కూడా బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఎంపీ స్థానాలన్నీ కూడా బీసీలకు ఇచ్చారన్నారు. వలంటరీ వ్యవస్థ జగనన్న పెట్టిన గ్రామ స్వరాజ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జేవీ ఝాన్సీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు సూర్యారావు, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు కాలాభక్తుల సుజాత, వైస్ ఎంపీపీలు ప్రభావతి, రత్నకుమారి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్